# పాతికేళ్ళ ప్రగతి

- కృష్ణ దేవులపల్లి
*("తెలుగు వెలుగు" జూలై 1996)*

"నిద్రకు వెలినై నేనొంటరినై - చీకటిలోపల నా గదిలో - నా గదిలోపల చీకటిలో" అంటూ ఆవేశంతో, ఆవేదనతో పాడుకున్న మహా మనీషి నుండి ఆవిర్భవించింది "మహా ప్రస్థానం". విద్యాభ్యాసం కోసం, బ్రతుకు తెరువుకోసం కొన్ని వేల మైళ్ళు వచ్చిన ప్రవాసాంధ్రులు పుస్తకాలతో కుస్తీ పడుతూ, ముందు పరచుకున్న జీవితం ఎడల భయ సందేహాలు ముంచుకొస్తున్నా, తమకున్న అతి కాస్త తీరిక సమయంలో వెలువరించిన ఉత్సాహం, ఉద్వేగం కారణంగా ఉద్భవించింది టిఎజిసి - 1971 లో! అలా ప్రారంభమైన విశాల చికాగో తెలుగు సంస్థ (Telugu Association of Greater Chicago) టిఎజిసి కి ఇప్పుడు పాతికేండ్లు. ఈ సందర్భంగా టిఎజిసి ఇన్నాళ్ళుగా సాధించిన ప్రగతిని సింహావలోకనం చేసుకోవడం సబబు.

1970 కంటే ముందు చికాగో నగర వీధుల్లో ఒక తెలుగువాడికి మరొక తెలుగువాడు కనిపిస్తే (ఆ మాటకొస్తే మరో భారతీయుడు కనిపిస్తే) చాలు చేటంత మొహం చేసుకుని, వళ్ళంతా గగుర్పొడవగా, గొంతు గద్గదికం కాగా గుండెలోతుల్లోంచి "హలో" అంటూ పలుకరించుకొనేవారు. ఆ రోజుల్లో తెలుగు కుటుంబాలు ఒకొళ్ళకొకళ్ళు ఎక్కడ తారస పడేవారో తెలుసా? చికాగో డౌన్‌టవున్‌లో వున్న ఇటాలియన్ గ్రోసరీ స్టోరులో. ఎందుకంటే ఆరోజుల్లో ఇండియన్ గ్రోసరీ స్టోర్లు మచ్చుకు కూడా లేవు... మనకు కావలసిన సామగ్రి ఇటాలియన్ స్టోర్సులో దొరికేది.

పరిస్థితులలా ఉండగా...

1970 నవంబరులో యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్‌లోని ఇద్దరు విద్యార్థులు... యుగంధర్, నరసింహం... సరదాకోసమని వేసుకున్న సినిమా "బొబ్బిలియుద్ధం" కేవలం 20 మందికని ఏర్పాటు చేస్తే 200 మంది వచ్చి చూచిన రోజు. బహుశః ఆ రోజు ఎవరూ ఊహించకుండవచ్చు మరో రెండు నెలల్లో వారికి ప్రత్యేక సంఘం ఏర్పడనున్నదని! కాని నిజంగా జరిగిందదే! ఉమ్మడి అలవాట్లు, ఆచారాలు ఉన్న ఇందరం ఇచ్చట మనకొక సంఘం అంటూ ఎందుకుండగూడదు అనే పట్టుదల పెరిగింది. 15 మంది ఉత్సాహవంతులతో ఒక కార్యాచరణ సమితి ప్రారంభమై, రెండు నెలల వ్యవధిలోనే రాజ్యాంగపు చిత్తు ముసాయిదాను ఏర్పరుచుకొని, ఎన్నికలు జరుపుకొని 1971 ఉగాదినాటికి ఒక సంఘంగా... టిఎజిసి గా... ఏర్పడి వేడుకలు జరుపుకున్నారు తెలుగువారు. ఆనాటి నుండి నేటివరకు ఎన్ని అడ్డంకులనో అధిగమిస్తూ పరిణితి చెందుతున్నదీ సంస్థ.

రెండు సినిమాలు, ఒక పిక్నిక్, ఘంటసాల సంగీత కార్యక్రమం... ఇదీ 1971లో కంఠమనేని రామకృష్ణ అధ్యక్షులుగా టిఎజిసి నిర్వహించిన ముఖ్య కార్యక్రమాలు.

ఆ తర్వాత 1972లో, అట్లూరి చంద్రశేఖరరావు అధ్యక్షులుగా టిఎజిసి చాలా వరకు అంతకుముందు సంవత్సరపు వరవడిని నిలిపింది. ఆకాలంలో సభ్యత్వ రుసుము రెండుడాలర్లే అని చెబితే మీరు నమ్ముతారా? "వింతలు-విడ్డూరాలు" శీర్షిక క్రింద ప్రచురించమంటారా?

1973 వ సంవత్సరం టిఎజిసి చరిత్రలో ఒక కొత్త మలుపు. అప్పటివరకే కార్యక్రమాలు ఎలా నిర్వహించాలనే విషయమై కొంత అనుభవం చేకూరింది. యడ్లపాటి యుగంధర్ అధ్యక్షతలో మొదటిసారిగా 20 డాలర్ల సీజన్ టికెట్ ప్రవేశపెట్టబడింది. ప్రతినెలా విధిగా ఒక కార్యక్రమం నిర్వహించబడింది... సంవత్సరంలో మొత్తం 15 కార్యక్రమాలు జరిగాయి. ఇదే సంవత్సరం తెలుగు సినీ ఆకాశంలో దగద్దాయ మానంగా వెలుగుతున్న ఏడునక్షత్రాలు- వాణిశ్రీ, గుమ్మడి, ఎస్. వి. రంగారావు, రాజబాబు, సత్యనారాయణ వగైరా- టిఎజిసి రంగంపై కనిపించారు(యి). వారు వస్తూ వస్తూ ఏడు తెలుగు సినిమాలు తమ వెంట తెచ్చారు. వాటిని ప్రతి నెలా ఒకటి చొప్పున ఇచ్చట ప్రదర్శించారు. విరివిగా లభించిన విరాళాలతో టిఎజిసి ఒక ప్రొజెక్టరు కొనుక్కొంది. ఈ సంవత్సరమే టిఎజిసి ఇల్లినాయిస్‌లో రిజిస్టరు చేసుకుంది. ఇంకా కేంద్ర మంత్రి శ్రీ కె.యల్. రావును, సియస్ఐఆర్ అధ్యక్షులు డా|| వై. నాయుడమ్మగార్లను ఈ సంఘం సత్కరించింది.

1974లో, అంతకు ముందు సంవత్సరం ఉపాధ్యక్షులుగా పనిచేసిన కొప్పొల్ సూర్యనారాయణ రావు (మిత్రులకు కె. యస్. రావుగా పరిచయం) అధ్యక్షులయారు. వీరు 1973 "టెంపో"ను అలా నిలబెట్టారు. ఆ సంవత్సరం చికాగో వచ్చిన హేమామాలిని, అక్కినేని నాగేశ్వరరావు, పి. వి. నర్సింహారావు గార్లు తెలుగు సభ్యులనుద్దేశించి మాట్లాడారు. అంతేకాక

మొదటిసారిగా ఒక తెలుగు స్కూలును ప్రారంభించి వారానికొకసారి మన పిల్లలకి తెలుగులో పాఠాలు బోధించారు.

1975లో గల్లా రామచంద్రయ్య నాయుడు అధ్యక్షులుగా టిఎజిసి గణనీయమైన ప్రగతి సాధించింది. ఈ సంవత్సరం టిఎజిసి రాజ్యాంగానికి తుది రూపం యిచ్చి నాన్-ప్రాఫిట్ సంస్థగా ఐఆర్ఎస్ నుంచి ఆదాయపు పన్ను మినహాయింపు హోదాను సంపాదించింది. అకౌంట్సును క్రమబద్ధం చేయటం, కార్యక్రమాలు జరుగుతున్న తీరుతెన్నులు డాక్యుమెంటు చేయడం, తెలుగు పాఠశాలను నడపటం, "తెలుగు డెవలప్ మెంట్ ఫండ్"ని స్థాపించటం ఈ సంవత్సరమే జరిగింది. ఈ సంవత్సరం జరిగిన మరో చెప్పుకోదగ్గ మలుపు- ప్రతి నెలా జరిగే తెలుగుకార్యక్రమాల్ని వివరిస్తూ వచ్చే వార్తాపత్రిక "తెలుగు వెలుగు"ను ప్రారంభించటం. దీన్ని అప్పటి కార్యదర్శి, పరిమి శ్రీరంగనాయకులు అత్యంత సుందరంగా నిర్వహించారు. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి శ్రీకోకా సుబ్బారావును సత్కరించారు.

1976లో ముత్యాల బ్రహ్మాజీ అధ్యక్షులుగా టిఎజిసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటంలో ఒక బలీయమైన ముద్ర వేసింది. దీపావళి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తరువాత వారికి మార్గదర్శకాలయ్యాయి. ఆసారి వారు "ప్రొఫెషనల్" ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు; ఎన్నో నృత్య ప్రదర్శనల్ని నిర్వహించారు. రత్నపాప డాన్సు ప్రోగ్రాంనేర్పాటు చేశారు. చిన్న పిల్లలకార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా కృషి చేశారు.

1977లో, తేళ్ళ తిరుపతయ్య అధ్యక్షులుగా టిఎజిసి తన ఉనికిని మిగతా భారతీయ అసోసియేషన్లు గుర్తించేట్లుగా చేయటంలో కృషిచేసింది. దీని ఫలితమే ఇండియా లీగ్ ఆఫ్ అమెరికా ( ప్రస్తుతం దీన్నే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అసోసియేషన్స్ అంటారు.) స్థాపించటంలో చొరవ తీసుకోవటం; ఇండియన్ కమ్యూనిటీలు మత సంబంధంగా తమ ప్రత్యేకతను నిలుపుకునేందుకు వీలుగా హిందూ టెంపుల్ స్థాపనకై నాయకత్వం తీసుకోవటం తార్కాణాలు. పద్మిని డాన్సు ట్రూపు రావటం ఆ సంవత్సరపు ప్రత్యేక కార్యక్రమం. ఆంధ్రప్రదేశ్ వరద నివారణ నిధికోసం డాలర్లు సమీకరించి శ్రీరామకృష్ణ మిషన్ వాళ్ళకు పంపారు.

1978లో బొబ్బా మురళి అధ్యక్షులుగా టిఎజిసి ఉనికిని అమెరికన్ల మధ్యకి తీసుకుపోయే ప్రయత్నం జరిగింది. రిపబ్లిక్ డే సందర్భంగా ఇవాన్స్టన్‌మేయరును ఆహ్వానించటం; లిలియన్‌కార్టరు వచ్చిన సందర్భంగా ఒక ప్రత్యేక బృందం వారిని కలవటం దీనికి నిదర్శనాలు. తెలుగు యువతకు ప్రాముఖ్యత నివ్వటం జరిగింది. శ్రీరామనవమి సందర్భంగా బౌలింగ్‌టోర్నమెంటు నేర్పాటు చేయటం ఒక ప్రత్యేకత.

1979లో దోనిపర్తి వెంకయ్య అధ్యక్షులు. తృతీయ ఉత్తర అమెరికా సభల్ని చికాగోకు రప్పించటం, పిక్నిక్ సందర్భంగా పత్రికా విలేకరులను పిలిచి మన సంస్కృతిని గూర్చి తెలుసుకునే అవకాశం ఇవ్వటం, సుశీల-బాలసుబ్రహ్మణ్యం పాటకచేరీని ఏర్పాటు చేయటం ఈ సంవత్సరపు ప్రత్యేక కార్యక్రమాలు.

1980లో హెజీబు రామచంద్రరావు అధ్యక్షులుగా ఎక్కువ మంది సభ్యుల్ని అసోషియేషన్‌లో చేర్పించటం జరిగింది. సైకిల్ పై ప్రపంచ పర్యటన చేస్తూ చికాగో చేరుకున్న శ్రీ బి. వి. నారాయణను గౌరవించటం; భారతదేశపు ఉపప్రధానమంత్రి ఆచార్య శ్రీ ఎన్. జి. రంగా గారిని సత్కరించటం ఈ కార్యవర్గం నిర్వహించిన కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు. చికాగో తెలుగు వారందరికీ ఒక తెలుగుసంచార గ్రంథాలయాన్ని ఏర్పరచాలని ఈ కార్యవర్గం తీర్మానించి 300 డాలర్ల సీడ్ మనీతో తెలుగు పుస్తకాలు కొనటం ప్రారంభించింది. తెలుగు అసోసియేషన్ డైరెక్టరీలో సభ్యుల పేర్లతో పాటు వారి పిల్లల పేర్లు కూడా ప్రకటించే ఆనవాయితీని ఈ కార్యవర్గమే ప్రవేశపెట్టింది.

1971లో టిఎజిసి సంస్థ ప్రారంభమైన నాటినుంచి 1980 దాకా కార్యవర్గ సభ్యుల ఎంపిక భారీ ఎత్తున ఎలక్షన్లు నిర్వహించవసరం లేకుండానే జరిగింది. 1973లో మాత్రం ఎలక్షన్ల ప్రచారం ముమ్మరంగా జరిగిందని వినికిడి. 1981 నుండి 1984 దాకా మాత్రం ప్రతి సంవత్సరం రెండు వేర్వేరు స్లేట్స్-- ప్రెసిడెంట్ నుండి కార్యవర్గసభ్యుడి దాకా-- చికాగో తెలుగు ఓటర్ల ముందు ఉంచబడ్డాయి. ఇది ఒక కొత్త వరవడిని ప్రవేశపెట్టడం వలన ఈ అంశాన్ని ప్రత్యేకంగా పేర్కొనటం జరిగింది. 1981లో శ్రీ మంతాని జనార్దనరెడ్డి-- శ్రీ జవ్వాజి బాబూరావులు; 1982లో శ్రీ అక్కినేని సుదర్శనరావు--శ్రీ జవ్వాజి బాబూరావులు; 1983లో శ్రీమతి వేమూరి శ్రీలత--శ్రీ అట్లూరి రాజేంద్ర ప్రసాద్‌లు; 1984లో శ్రీ మాధవరెడ్డి-శ్రీ పోగుల లక్ష్మీనారాయణ శర్మలు తమ పూర్తి పానెల్‌ను టిఎజిసి సభ్యుల ముందుంచి ఒక్కొక్క సంవత్సరంపాటు సేవచేసే అవకాశం ఇవ్వవలసిందిగా అభ్యర్థించారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో వేర్వేరు వర్గాలవారు తమ నిర్దుష్ట ప్రణాళికను ప్రజలముందుంచి ఆమోదాన్ని ఆశించటంలో అసహజం ఏమీ లేదు. 1981లో మొదలైన ఈ ఒరవడి ద్వారా టిఎజిసి కి దీర్ఘకాలంలో లాభం చేకూరిందా లేక నష్టం జరిగిందా విపులీకరించే ఉద్దేశ్యం ఈ వ్యాస కర్తకి బొత్తిగా లేదు. ఆ చర్చ ఈ వ్యాస పరిధిలో ఇమడదు కూడా!

1981లో శ్రీమంతాని జనార్దనరెడ్డి అధ్యక్షులు. ఈ సంవత్సరం శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు టిఎజిసి గ్రంథాలయానికి కొన్ని ఉత్తమ ప్రచురణల్ని ఉచితంగా పంపారు. ఇదే సంవత్సరం చికాగోలో జరిగిన మూడవ తానా సభల సందర్భంగా టిఎజిసి స్థానిక నిర్వాహకులుగా అనేక గురుతర బాధ్యతలను వహించింది- సెంట్రల్ కో ఆర్డినేటింగ్ కమిటీ,

ఫయినాన్సు కమిటీ, హాస్పిటాలిటీ కమిటీ, కల్చురల్ కమిటీ, సావనీర్ కమిటీ, వెన్యూ కమిటీ, ఆర్ట్సు కమిటీ, డిస్కషన్ కమిటీల్లో టిఎజిసి సభ్యులు అతి చొరవతో పనిచేసి తానా సభల్ని దిగ్విజయంగా జరిగేట్లు చూశారు. ఇదే సంవత్సరం శ్రీమంతాని జనార్దనరెడ్డి టిఎజిసి రాజ్యాంగాన్ని సమీక్షించేందుకు 25 మంది సభ్యులతో ఒక అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేశారు. శ్రీకట్టమంచి ఉమాపతి రెడ్డి, శ్రీలింగంనేని జగన్మోహనరావులు వారి రికమండేషన్‌లను కార్యవర్గానికి సమర్పించారు. కాని ఆ మార్పుల్ని సర్వసభ్య సమావేశంలో సభ్యుల ముందుంచడానికి ఈ సంవత్సరం వీలు కాలేదు.

1982లో శ్రీ అక్కినేని సుదర్శనరావు అధ్యక్షులు. వీరి కార్యవర్గం తెలుగువారికి సాంస్కృతిక కళాకేంద్రభవనం ఒకటుంటే బావుంటుందని తీర్మానించింది. గొప్పవైణికురాలుగా పేరొందిన శ్రీమతి జలజాకుమారి నృత్యాన్ని, శ్రీమతి వైదేహిగారి గాన సభను ఏర్పాటు చేశారు. వీరి హయాంలో శ్రీ వెంపటి చిన సత్యంగారి కూచిపూడి బృందం ప్రదర్శించిన సంగీతనృత్య రూపకం, శ్రీ కృష్ణ పారిజాతం హైలైట్.

1981లో తలపెట్టిన టిఎజిసి రాజ్యాంగ సవరణల్ని మరికొన్ని చిన్న మార్పులతో ఈ ఏటి కార్యవర్గం సర్వసభ్యసమావేశానికి సమర్పించి ఆమోదముద్రను పొందింది.

ఈ సంవత్సరపు డిశంబరు తెలుగు వెలుగులో సంపాదకీయం వ్రాస్తూ శ్రీలింగంనేని జగన్మోహనరావు, శ్రీమతి శారదాపూర్ణ గార్లు - సహనం తక్కువైన కారణంగా కూరిమితో కుదుర్చుకోగల కొన్ని సమస్యల్ని చేయి జారిపోనిస్తున్నామేమోననే బాధను వ్యక్తం చేశారు. ఇదే సంచికలో 1983 కార్యనిర్వాహక వర్గపు ఎన్నికలపై ప్రచురించిన రిపోర్టు తర్వాత తర్వాత గాలి దుమారానికి దారి తీసింది.

రచనను నడిపించటంలో కష్టం ఎదురైనప్పుడు ఒక దీర్ఘశ్వాస తీసుకోవడం ఈ రచయితకి అలవాటు. 1982 నుండి 1983 కు జరిగిన మార్పుని వివరించాలంటే అలాంటి అవసరమే కలిగింది. 1983 తానా సభలకి డెలిగేట్స్ని ఎవరు ప్రతిపాదించాలనే విషయంలో వివాదం వచ్చింది.

ఆంధ్రప్రదేశ్‌లో సంభవించే రాజకీయ పరిణామాలు కాని, నాయకత్వపు మార్పులుకాని; లేదా తానా సభల్లో ఎవరు ప్రముఖపాత్ర వహించాలి అనే విషయంగాని స్థానిక సంస్థల దైనందిన వ్యవహారాలను ప్రభావితం చెయ్యటం మొదలెడితే స్థానికసంస్థల మనుగడకేమైనా ముప్పా అనే విషయం సంయగ్దృష్టితో చర్చించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

1983లో శ్రీమతి వేమూరి శ్రీలత ద్వారా టిఎజిసి మొట్టమొదటి మహిళాధ్యక్షురాల్ని ఎన్నుకుంది. ఇంతకు ముందు ప్రస్తావించిన తానా డెలిగేట్ల వ్యవహారం చిలికి చిలికి గాలి దుమారమయినట్లు న్యాయస్థానంలో పరిష్కరించుకోవలసిన అవసరం ఏర్పడింది. వ్యక్తిగతమైన విషయాలపై కాక, సంస్థాపరమైన అంశంపై కోర్టుకెక్కడం టిఎజిసికి ఇదే మొదటిసారి.

పన్నెండు తెలుగు వెలుగులు ప్రతినెలా అనుకున్న సమయానికి అందజేసినందుకు ఈ కార్యవర్గాన్ని శ్లాఘించక తప్పదు. తెలుగు వార్తాపత్రికని ఎలా నిర్వహించాలనే విషయంలో ఉన్నత ప్రమాణాల్ని సృష్టించి తర్వాతి తరాలకి మార్గదర్శకులయ్యారు. తెలుగు వెలుగు ద్వారా వెల్చేరు నారాయణరావు- వేమూరి శ్రీలతలు నేర్పిన తెలుగు పాఠాలు; "పదుగురాడు మాట" శీర్షికన మన కెదురయ్యే సమస్యలను గురించి బాహాటంగా చర్చించుకునే వేదికను సృష్టించి; పాతవెలుగులు శీర్షికన కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, భమిడిపాటి కామేశ్వరరావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి ప్రభృతుల రచనలు పునర్ముద్రించి ఈ రచయితల క్రియాశీలత్వాన్ని - ఆలోచనల పదునును ఇచ్చటి తెలుగు సభ్యుల చేరువకు తీసుక వచ్చేందుకు పరిశ్రమించారు.

1984లో శ్రీమాధవరెడ్డి టిఎజిసి అధ్యక్షులుగా ఎన్నికయారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీఎన్. టి. రామారావుగారిని వీరు సత్కరించారు. తెలుగు అకాడమీ, అంతర్జాతీయ తెలుగు సంస్థకు డైరెక్టరుగా వ్యవహరించిన శ్రీపోణంగి శ్రీరామ అప్పారావుగారు టిఎజిసి సభ్యులనుద్దేశించి రెండుసార్లు ప్రసంగించారు. ప్రఖ్యాత వైణికులు శ్రీ ఈమని శంకరశాస్త్రిగారి కచేరీ ఏర్పాటు చేశారు. రానురాను సభ్యుల సంఖ్య పలుచబడనారంభించింది. టిఎజిసిలో సంఘీభావం కొరవడుతున్నదని పసిగట్టి కాబోలు శ్రీ ఊట్కూరు అనంతరామారావు, శ్రీ దోనిపర్తి వెంకయ్యగారలు నవంబర్- డిశంబర్ తెలుగు వెలుగులో సభ్యులనుద్దేశించి ఒక విజ్ఞాపన చేశారు.

1985లో శ్రీ వేలూరి వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. " తెలుగువెలుగులు సకాలంలో అందించటంలో 1983లో కార్యదర్శిగా కనపరిచిన కార్యదీక్షనే పునరుక్తి చేశారు. తెలుగు వెలుగు ప్రకటించటమనేది ఖర్చుతో కూడుకున్న ప్రయాస" అనే అపప్రథను తొలగించటానికా అన్నట్లు టిఎజిసి " తెలుగు వెలుగు" ముద్రణ ద్వారా రెండు వేల డాలర్ల ఆదాయం చూపారు. టిఎజిసి రమ్య హర్మ్యంలో బీటలు కనిపించిన యీ సంవత్సరంలో సభ్యుల సంఖ్య 400 కుటుంబాలు చేరటం గమనార్హం. శ్రీమతి శోభానాయుడు బృందంతో "మేనక-విశ్వామిత్ర" నృత్య నాటికను ఏర్పాటు చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు శ్రీ మిట్టూరు జనార్థన్ సితారు వాద్యాన్ని- శ్రీ ఎ. లక్ష్మణరావు తబలా తోడు కాగా- ఏర్పాటు చేశారు. ప్రముఖ చిత్రకారుడు "బాపు" చికాగో విచ్చేసిన సందర్భంగా వారి చిత్ర ప్రదర్శన నొకదాన్ని ఏర్పాటు చేశారు.

1986లో శ్రీదామరాజు సచ్చిదానందమూర్తి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిర్వహించిన కార్యక్రమాల్లో సినిమాలు వేయటం కాస్త తగ్గించి సాంస్కృతిక కార్యక్రమాలను విరివిగాను, విశిష్టంగాను ఏర్పాటు

చేసిన కమిటీగా వీరికి పేరు వచ్చింది. "వశీకరణం", "భజంత్రీలు" అనే నాటకాలు ప్రదర్శించటమే కాక ప్రప్రథమంగా టిఎజిసి స్టేజి మీద ఏర్పాటు చేసిన మహిళల గ్రూపు డాన్సు, పూర్తి పౌరాణిక దుస్తులతో మూర్తి వేసిన "మయసభ" ఏకపాత్రాభినయం, ఇండియా నుంచి వచ్చిన ఆరి తేరిన కళాకారులు ప్రదర్శించిన వెరైటీ ప్రోగ్రామ్, పౌరాణిక పద్యనాటకం, పిల్లలతో చేయించిన సంగీత నృత్య రూపకాలు ఈ యేటి ప్రత్యేకతలు. లేమాంట్‌లోని శ్రీరామాలయం కుంభాభిషేకానికి టిఎజిసి అన్నదానం స్పాన్సర్ చేయగా, మహిళలంతా పూనుకొని, 1500 మందికి షడ్రసోపేతమైన విందులు వడ్డించారు.

1987లో శ్రీమతి చింతం రాణీ సంయుక్తం ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. "వశీకరణం" డ్రామా, "చేయెత్తి జైకొట్టు తెలుగోడా" నృత్యం, చిమట రాధిక ఆధ్వర్యంలో లంబాడీ నృత్యం, యూత్ మెంబర్లు ఏర్పాటు చేసిన ఫేషన్‌షో ఆ యేటి "తానా" సభలలో ప్రదర్శించారు. ప్రసిద్ధ నర్తకి సరళకుమారి నాట్య ప్రదర్శన, శ్రీ మాండలీన్ శ్రీనివాస్ సంగీత కచేరీ, శ్రీమతి ఎస్. జానకి సంగీత విభావరి - వీరు జరిపిన కార్యక్రమాల్లో తలమానికాలు.

1988లో శ్రీ బడ్డి రాఘవేంద్రరావు అధ్యక్షులు. ఈ సంవత్సరం ఇండియా నుంచి కళాకారులు ఎవ్వరూ రానందు వల్ల స్థానిక టేలంటుతోనే అన్ని కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది. ప్రతి కార్యక్రమంలోనూ విందులు వడ్డించారు. ఎఫ్. ఐ. ఏ. జరిపిన ఇండియా పెరేడ్‌లో పాల్గొన్నారు; "తానా" గవర్నింగ్ బాడీ మీటింగ్‌కు ఆతిధ్యం యిచ్చారు.

1989లో శ్రీ బొల్లవరం విశ్వనాధరెడ్డి అధ్యక్షులు. శ్రీ మతి సుశీల, శ్రీ సౌందరరాజన్‌ల సంగీత కార్యక్రమం; ప్రముఖ సినీ నటుడు శ్రీ చంద్రమోహన్ - వారి బృందం వేసిన నాటకాలు; షణ్ముఖ శ్రీనివాసన్‌గారి నృత్య ప్రదర్శన; శ్రీనారాయణ రెడ్డిగారితో ఏర్పరచిన కవితా గోష్టి యీ సంవత్సరపు విశేష కార్యక్రమాలు. టిఎజిసి అవతరించిన నాటినుంచి మాట సహాయం, ధనసహాయం చేస్తూ కొండంత అండగా ఉన్న డా॥ కె. టి. రెడ్డిగారు, ఈ సంవత్సరం దివంగతులైనారు.

1990లో శ్రీ రుద్రరాజు ఎస్. రాజు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పదవీ బాధ్యతలు తీసుకొన్న కొద్ది రోజుల్లోనే రాజుగారు టిఎజిసిని, ట్రైస్టేట్ తెలుగు అసోసియేషన్‌ను ఏకత్రాటి కిందకు తీసుకు వచ్చే ప్రయత్నంలో టి. టి. ఏ నాయకులతో ముఖాముఖి చర్చలు జరిపి, ఒక సమైక్యతా ప్రతిపాదనతో వచ్చారు. ఈ రాజీ ప్రతిపాదనలో నిబిడీకృతమైన కొన్ని షరతులతో టిఎజిసి కార్య వర్గం ఏకీభవించనందున శ్రీరాజు అధ్యక్షపదవినుంచి వైదొలగారు. అదే కమిటీలో ఉపాధ్యక్షులుగా ఉన్న శ్రీవేమూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షుని బాధ్యతలు స్వీకరించారు. శ్రీ వేమూరి 1991లో తిరిగి అధ్యక్షులుగా ఎన్నికై తమ విధ్యుక్తబాధ్యతల్ని నిర్వహించారు. అమెరికాలో పెరుగుతున్న తెలుగువారు నెలకొకసారి కలిసి ఏసినిమావో చూసే అవసరాలను అధిగమించారని, అనూచానంగా వస్తున్న మన ఆచారాల్ని, విలువల్ని యిచ్చట పెరుగుతున్న పిన్న, పెద్దలందరిలో వ్యాప్తిలోకి తీసుక రావాలని వీరి సంకల్పం. ఈ సంకల్ప సాధనకయ్యే ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పిల్లలకై ఉపన్యాస పోటీలు, క్విజ్ కాంపటీషన్లు నిర్వహించారు. మొట్టమొదటిసారిగా "తెలుగువెలుగు"ను కంప్యూటరైజ్డు స్క్రిప్టులో ప్రకటించారు. ఆ ఘనత డా॥ ద్రోణంరాజు శ్రీరామకృష్ణ, శ్రీమతి కాశీనాధుని రత్నకుమారి గార్లది.

1992లో బత్తిన శ్రీధర్ అధ్యక్షులుగానూ, శ్రీమతి దామరాజు లక్ష్మి ఉపాధ్యక్షురాలిగానూ ఎన్నికయ్యారు. అయితే బత్తిన ఉద్యోగరీత్యా ఊరు మారిన కారణంగా లక్ష్మిగారు అధ్యక్షపదవిని స్వీకరించి, అతి దక్షతతో టిఎజిసి కార్యక్రమాలు నిర్వహించారు. వీరు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లోని కొన్ని ముఖ్యాంశాలు: యూత్ ప్రోగ్రామ్ విత్ గ్రాడ్యుయేషన్ సెలెబ్రేషన్; ఎస్. పి. బాలసుబ్రమణ్యం శైలజల లైవ్ మ్యూజిక్ ఎక్స్ట్రావగాంజా; గొల్లపూడి మారుతీ రావు-కైకాల సత్యనారాయణల బృందం సమర్పించిన వెరైటీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రోగ్రాం; ప్రఖ్యాత నాట్య కళాకారులు పద్మశ్రీలు రాధారెడ్డి-రాజారెడ్డిగార్ల నృత్య ప్రదర్శన; హైదరాబాద్ నుంచి విచ్చేసిన సుదర్శనరెడ్డిగారి "యోగ లెక్చర్ డిమాన్‌స్ట్రేషన్"; ప్రొద్దుటూరునుంచి విచ్చేసిన నరాల రామి రెడ్డిగారి అష్టావధానం; హైదరాబాద్ నుంచి విచ్చేసిన విల్లివలం నాగేష్‌గారి హిప్నటిజం కార్యక్రమాలు; సాహిత్య స్థాయిలో ప్రచురించిన తెలుగు వెలుగులు.

1993లో శ్రీవేదం వెంకట సుబ్రహ్మణ్యం అధ్యక్షులు. సంవత్సరారంభంలోనే శ్రీవేదం "సంస్థ ఏంచేస్తే సభ్యులు మెచ్చుతారు?" అనే విషయంపై సభ్యుల అభిప్రాయాన్నడిగారు. కాని, సభ్యులనుంచి సరియైన రెస్పాన్స్ రాలేదు. శ్రీవేదం, ప్రతి కార్యక్రమంలోనూ కొద్ది సమయం శ్రీమద్భగవద్గీత ప్రవచనం చేశారు. టిఎజిసి రాజ్యాంగంలో కొన్ని సవరణలను గురించి శ్రీవేమూరి సుబ్రమణ్యం, శ్రీ మాధవరెడ్డి, శ్రీదామరాజు మూర్తి, శ్రీతోట రంగ ప్రసాదులు పనిచేశారు.

1994లో శ్రీచిమట గోపాలకృష్ణమూర్తి అధ్యక్షులు. కొత్తగా అమలులోకి వచ్చిన టిఎజిసి రాజ్యాంగానికి అనుగుణంగా 21 మంది సభ్యులతో ఒక బోర్డును ఏర్పరిచారు. శ్రీమతి పి. భానుమతితోనూ, శ్రీసినారాయణ రెడ్డి; ప్రొఫెసర్ శ్రీ యు.వి. రావులతోనూ సమావేశమేర్పాటు చేశారు. శ్రీజంధ్యాల బృందం, శ్రీబాలసుబ్రమణ్యం, శ్రీమతి శైలజల సంగీతం, శ్రీవెంపటి చిన సత్యంవారి బృందం నృత్య ప్రదర్శన, శ్రీఅక్కినేని నాగేశ్వరరరావు అభినందన సభలను టిఎజిసి, టిటిఏలు సంయుక్తంగా ఏర్పాటు చేయడం గమనార్హం.

1995లో శ్రీమతి కొమాండూరి సావిత్రి అధ్యక్షురాలు. 1994 టిఎజిసి బోర్డులో వీరు ప్రెసిడెంట్-ఎలక్టు కావడం వల్ల ఒక సంవత్సరమంతా టిఎజిసి కార్యవర్గపు తీరుతెన్నులు, కష్టనష్టాలు చాలా చేరువనుంచి చూచి, నేర్చుకొనే అనుభవం లభించింది. ఈ సంవత్సరం తెలుగు యువత కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనేందుకు ప్రోత్సహించటం జరిగింది. ఉగాది కార్యక్రమంలో 35 మంది యువకళాకారులు పాల్గొన్నారు. యూత్ / ఇండిపెండెన్స్‌డే ఉత్సవాల్లో చికాగోలోని ఇతర భారతీయ సంఘాలలోని యువతీయువకులుకూడా కలవటం ఒక విశేషం. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిఫలింపచేసిన యీ కార్యక్రమాన్ని ప్రధాన అతిధిగా వచ్చిన ఇండియన్ కన్సల్ జనరల్ గారు అభినందించారు. అమెరికాలో స్థిరపడిన డా॥వెంపటి చిన సత్యంగారి విద్యార్థులతో ఒక శాస్త్రీయనృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు.

1996లో శ్రీయడవల్లి రమణమూర్తి అధ్యక్షులు. వీరు చికాగో తెలుగువారికి కొత్తేమీ కాదు. ఆ మాటకొస్తే 1970లో యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్‌లో సమావేశమై టిఎజిసి సృష్టికి కారకులైన ఉత్సాహవంతులైన యువవిద్యార్థుల్లో వీరు ఒకరు. ఆనాటినుంచి యీ నాటిదాక టిఎజిసికి అండగా నిలిచారు. టిఎజిసి యీ సంవత్సరం ఏర్పాటు చేస్తున్న యీ రజతోత్సవ కార్యక్రమాల్ని నిర్విఘ్నంగా నిర్వహించేందుకు అకుంఠితంగా చేస్తున్న యీ శ్రమే యీ కార్యవర్గం నిర్వహిస్తున్న బృహత్కార్యమని చెప్పవచ్చు. ఈ సంవత్సరం ఆగష్టులో సాహిత్యశిరోమణి బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మగారి అష్టావధానం యీ కార్యవర్గం తలపెట్టిన ప్రత్యేక కార్యక్రమం.

**తాజాకలం:** చిత్రగుప్తుని చిట్టాలాగ -- మంచీ-చెడులతో నిమిత్తం లేకుండా - ఈ 25 సంవత్సరాల్లో టిఎజిసిలో జరిగిన సంఘటనలను యధాతథంగా chronicle చెయ్యడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. చికాగో తెలుగు సంఘంలో విభజన రావడం, టిఎజిసి సభ్యత్వం తగ్గుముఖం పట్టడం జరిగినా ఈ వ్యాసానికి "టిఎజిసి సాధించిన ప్రగతి" అనే శీర్షికనివ్వటం సబబా కాదా అనే విషయమై కొంచెం వెనుకాముందాడాను. అయినా సంఘంలో ఆలోచనాశీలురున్నంత కాలం గతంలో జరిగిన అనుభవాల ఆధారంగా సంఘం ప్రగతి పథంవేపే పురోగమిస్తుందనే విషయంలో అచంచల విశ్వాసం ఉండడం వల్ల ఈ వ్యాసానికి ఈ శీర్షిక సమంజసమేనని రచయిత అభిప్రాయం.



*శ్రీ దేవులపల్లి కృష్ణారావుగారి రచనలు తెలుగు వెలుగు ద్వారా అందరికి పరిచయమే. చాలా కాలంగా అమెరికాలో ఉంటున్నారు. వృత్తి రీత్యా ఇంజనీరు. తెలుగు వెలుగు పత్రికను 1980 లో నిర్వహించారు. వీరు సునిశిత విమర్శకులు, మంచి వ్యాస కర్త, గేయ కవి.*

❋❋❋❋❋

